
# చుట్టం దేవుళ్ళు!



వేమూరి సత్యనారాయణ

ఓ చక్కని సాయంకాలం. నాలుగున్నర గంటలు దాటి రెండు నిమిషాలు కూడ కాలేదు. సంగీత హడావిడి పడిపోతోంది. అవును మరి హడావిడి కాదూ! 'షార్ప్ ఫైవ్ థర్టీ గాళ్' అన్నాడు మురళి ఆఫీసుకి బయల్దేరేటప్పుడే. 'అయిదున్నరకే పద నుగా' అన్న అతను ఆ మాటలకు ముందు సంగీత సౌందర్యంతో ముచ్చట్లా డుతూ చెప్పిన విషయం మరోటి వుంది. "సాయంత్రం లవ్‌స్టోరీ సినిమాకు వె

దాం. అమ్మమ్మమ్మ, సంగీతమ్మా అన్నీ ప్రేమ కథలేనా అని కొట్టివేస్తే ప్రమాదం. ఈ సినిమా పేరే 'లవ్‌స్టోరీ'సుమా, చూద్దాం 'మన బయాగ్రఫీ' ఏమైనా కాపీ కొట్టేశాడేమో ఆ రచయిత" అంటూ సంగీతను నిలువెల్లా పులకరింపజేసే మరెంతో ప్రేమాయణం నడిపి....ఆ తర్వాత అన్నాడు "అయిదున్నరకు తంచనుగా రడీగా వుండాలి" అని.

అందుకే సంగీత కంగారు పడిపోతూంది. అప్పుడే నాలుగున్నర దాటిపోయింది. సినిమాకు తీసికెళ్ళే ప్రియమైన భర్తకు, రావడంతోనే కొంచెం అల్పాహారం, ఆ పైన రెండు గుక్కలు కాఫీ సాయం చెయ్యకపోతే ఎలా! కాఫీ తర్వాత నా స్వీటో అంటూ అతనో చిలిపి పని చేస్తాడు. అదెలాగూ వుంది. మరి ముందు కాఫీ కావాలి గదా!

* * *

సంగీత వయసు ఇంకా టీన్స్‌లోనే వుంది. 'శ్రీమతి సంగీత'గా వయసుకి పసిపిల్లే. ఆర్నెల్లపైన ఆ(రోజులరోజుకి. అయితే 'మురళీ సంగీతం' అంటూ పిలిపించుకోవడం ప్రారంభించి సంవత్సరం పైబడిపోయింది.

ప్రేమించటంలో గొప్ప థ్రిల్లుందన్న వరకూ సంతోషంతో అంగీకరించే యీ యువ దంపతులు ప్రేమించి పెళ్ళిచేసుకోవడం చాలా కష్టం అన్న వాదనను 'ఛీ' కొట్టేస్తారు. వీళ్ళిద్దరూ ప్రేమపాఠాలు నేర్చుకోవడం మొదలుబెట్టడం గమనించిన ఇద్దరి తలిదండ్రులూ 'జాగ్రత్త ఒళ్లు చీరేస్తాం' అన్లేదుమరి! 'జాగ్రత్త జాగ్రత్తగా (ప్రేమను) చదూకోండి' అన్న పద్ధతిలోనే మాటలాడడంతో చాలా సామాన్యంగా మొదలైన ప్రేమ కాస్తా ప్రభంజనంలా పెరిగి, ఆ వేడికి అటు పెద్దలూ, ఇటూ పెద్దలూ, ఒకచోట చేరి, "విషయాలన్నీ మాటలాడుకొని" వీళ్ళ ప్రేమను ప్రేమతోనే పెళ్ళిగా మార్చేసేంత వరకూ వెళ్ళింది. మరో విశేషమేమంటే ప్రేమించుకోక పూర్వమే వీళ్ళిద్దరూ చుట్టాలు. మురళి అమ్మ, సంగీత నాన్నా స్వయానా తోబుట్టువులు.

మురళి సంగీత మెడలో మూడు ముళ్ళు అందరికీ కనపడేలా వేసి, ఎవరికీ కనపడకుండా సంగీతకు గాలి ముద్దిచ్చేసి, ఇటు తిరిగి సంతకంపెట్టి "ఉద్యోగంలో చేరమన్న తాఖీదు" పుచ్చేసుకొన్నప్పుడు, పెళ్ళయిన వేళా విశేషం అన్నారు' (పగలు లగ్నం!) పెద్దలు. 'చూశావా మా అబ్బాయి ప్రతాపం' అన్నట్లు చూశాడు మురళి తండ్రి మీసం మెలేస్తూ సంగీత తండ్రివైపు చూసి. "అదృష్టమెండి మూడు ముళ్ళు పడ్డాకే గదా ఆ అదృష్టం వెతుక్కుంటూ వచ్చింది ఆc" అన్న పంథాలో జవాబిచ్చాడు పెళ్ళికూతురు తండ్రి మీసాలు లేకపోవడంతో కండువా సర్దుకొంటూ.

పెళ్ళి తంతు ముగుస్తుండగానే 'ఎక్స్‌ప్రెస్' కాపురం పెట్టించేశారీ ప్రేమికుల చేత, పెద్దలు. కొన్నాళ్ళు గంగా భాగీరథీ సమానురాలైన సంగీత అమ్మమ్మ వీళ్ళకు తోడుగా వుంది. "అమ్మాయ్ నాక్కొంచెం నడుము నొప్పిగా ఉంటుందే ఇంక నీకేం ఫర్వాలేదుగా అన్నీ తెలుసు

కొన్నావు హాయిగా సంసారం చేసుకో నే వెళ్ళొస్తా" నెల రోజుల తర్వాత అమ్మమ్మ అన్నప్పుడు సంగీత మాట్లాడ లేదు మురళి "అప్పుడే వెళ్ళడమేమి టండీ" అని నొచ్చుకుంటూనే రైలెక్కిం చాడు ఆమెను

"అమ్మమ్మ అడ్డు" తీరడంతో చిక్కిన ఒంటరితనాన్ని జీవనరసమయ సంగీత భరితంగా మలచుకొని జీవితం సాగిస్తూ ఓ పది రోజుల తర్వాత కేలండర్ చూస్తే 'పదిరోజులు కాదోయ్ (ప్రేమ) పక్షులూ, మూడు పదిరోజులు' అంది కాలెండర్

"లేదు పదిరోజులే" అనుకొన్న మురళీ సంగీతలు అలాంటి మరో ఐదు పదిరోజులు గడిపేసరికి ఆశ్చర్యకరంగా ఆ మధ్యకాలంలో అయిదుసార్లు జీత మిచ్చేశారు మురళికి కంపెనీవాళ్ళు

* * *

'అమ్మయ్య కాఫీ అయిపోయింది' అనుకొంది సంగీత కాఫీ నింపిన ఫ్లాస్కు గోడకున్న మేకుకు తగిలిస్తూ అంతకు ముందే చేసిన 'ఉప్మా' సన్నని సెగను ఆస్వాదిస్తూ పొయ్యిమీదే ఉండిపోయింది


అన్నీ సర్ది, వీధి తలుపు గెడపెట్టి బాత్ రూంలోకి వెళ్ళింది సంగీత తిరిగి సంగీత వీధి తలుపు గెడ తీసేటప్పుడే గోడనున్న గడియారం రంగున ఒక గంట కొట్టింది 'షార్ప్ఫైవ్ థర్టీ' అయిందప్పుడు

అప్పుడు సంగీత ఒంటిపైన పాల నురగలా తెల్లగావున్న, అదేదో మిల్లువారు 'ఎల్లప్పుడూ యువతిలాగే వుండాలని అభిలషించే యువతుల కోసం' తయారు చేసిన చీర వున్నది. ఆ చీర అందాన్ని రెట్టిస్తూ లేతరంగులో జాకెట్టున్నది చీర తెల్లదనంతో, సంగీత సుతారంగా అక్కడక్కడా స్ప్రే చేసుకొన్న సుగంధ పరిమళ భరితమైన విదేశీ ద్రవంతో పోటీ పడుతూ ఆమె తలలో మల్లెపూలున్నాయి. మురళి వచ్చి 'రెడీ' అంటే తాళం కప్ప చేత్తో పుచ్చుకొని బయటకు అడుగేసేంత పర్ఫెక్ట్‌గా తయారయింది

ఒక్కసారి వీధిలోకి తొంగి చూసి, దూరంగా వస్తున్న స్కూటరును చూసి మెరిసే కళ్ళతో అలాగే చూస్తుండి పోయింది సంగీత మరు నిమిషంలో ఆ స్కూటర్ ఈ ఇంటి ముందు ఆగక పోవడం, ఆ స్కూటర్‌పైనున్న మనిషి తనవాడు కాకపోవడంతో చివాలున లోపలి కొచ్చి గుమ్మాని కెదురుగా వున్నకుర్చీలో కూలబడింది

టీపాయ్ మీదున్న పత్రిక తీసి చదవ బోయింది కుదరలేదు ప్రతి నిమిషమూ గుమ్మం దగ్గర బూట్ల చప్పుడు విన్పిస్తున్న భ్రమ కోపంగా విసిరికొట్టింది పత్రికను మళ్ళీ పత్రిక తీసుకొంది, పేజీలు తిరగేసింది దాన్నిండా అప్పడాల కర్రల కార్టూన్లు చూసి విసుక్కొని పత్రిక విసిరేసింది రేడియో పెట్టింది 'మల్లెలు వాడెనూ మనసు చెదిరెనూ మనసైన వాడూ, మళ్ళీవస్తాననీ 'వస్తోన్న పాట విని చిర్రెత్తుకొచ్చి రేడియో గొంతు నొక్కేసింది పాపం 'మ'తో మొదలై తర్వాత కవిగారు ఏ పదం వాడారో తెలుసుకోలేక పోయింది సంగీత

గడియారం ఏడుగంటలు కొడుతూం




డగా మెలకువ వచ్చింది సంగీతకు. ఆరూ నలభై వరకు తాను గడియారం చూస్తూనే వుంది అప్పుడప్పుడు. గడియారం ఆరున్నరైందని చెప్పినప్పుడు 'షార్ప్' అంటే సరిగ్గా గంట తర్వాత అనేమైనా అర్థం వుందేమో డిక్షనరీలో చూద్దామని అనుకోవడం కూడా గుర్తుంది తనకు. ఇంతలోనే నిద్రెలా పట్టిందో. తలుపులు తీసే వున్నాయి. ఇంకా నయం దొంగా దెవరూ రాలేదు.

నెమ్మదిగా సంగీతలో ఉక్రోషం స్థానే కోపం చోటు చేసుకొంటోంది. అయిదున్నరకు వస్తానన్న ఈమనిషి.... అనుకొంటేనే కోపం వచ్చేస్తోంది. ఇంటికి రాగానే యుద్ధం ప్రకటించక తప్పదన్న నిర్ణయానికి వచ్చేసింది. అరగంటలో చేసుకున్న అలంకరణను అయిదు నిముషాల్లో తీసేసింది. తలుపు గెడపెట్టేసి ముసుగుతన్ని పడుకొంది.

*　　　*　　　*

"సంగీతా....గీతా....ఠక్ ఠక్ ఠక్."

ఉలిక్కిపడి లేచింది సంగీత. చుట్టూ చూసుకొంది. కోపంలో బెడ్ లైట్ కూడా వేసుకోలేదు. చీకటిగా వుంది. నెమ్మదిగా లేచి లైటు వేసి తలుపువైపు నడిచింది.

తలుపు తీసి నిలబడివున్న వ్యక్తివంక కోపంగా చూడబోయింది. అంతలోనే ముఖం ప్రసన్నం చేసుకొని 'రండి.... రండి....బావగారా....ఎప్పుడు రావడం... ఆ....ముందుగా ఉత్తరం వ్రాస్తే స్టేషనుకు రాకపోదునా....అయ్యో....ఇల్లు తెలుసుకోవడానికి ఎంత శ్రమపడ్డారో ఏమిటో..."

అంటూ తెగ నొచ్చుకోసాగింది.

గుమ్మంలోని వ్యక్తి తెల్లబోయాడు. కంగారుపడ్డాడు. ఖంగారుగానే మాట్లాడాడు "ఆఁ....ఇదే రావడం—ఇంతకీ లోపలకు రానిచ్చేదేమైనా వున్నదా ఇక్కడే....!"

"అయ్యేయ్యో ఎంతమాట బావా రండి" అంటూ దారితొలగి "అలా కుర్చీలో కూర్చోండి....కాఫీ త్రాగుతారా లేక పాలు మాత్రమేనా" అంటూనే లోపలికెళ్ళింది.

అయోమయంగా కుర్చీలో కూలబడ్డాడు మురళి. చెమటపట్టిన ఒళ్ళు నోటితోనే ఊదుకొని ఆలోచనారహితుడై వంటింటి వైపు చూస్తున్నాడు.

కాఫీ కప్పుతో వచ్చిన సంగీత కాఫీ మురళికిస్తూ "ఇంటి దగ్గర అంతా క్షేమమా బావగారూ. అత్తయ్య తిరుగుతున్నారా... పాపిష్టిదాన్ని యీ వయసులో ఆమెను చూసుకొంటూ ఆమె సేవ చేసుకొంటూ.."

కాఫీ త్రాగలేదు మురళి. ఢామ్మంటూ టేబిల్ మీద పెట్టేసి 'స్టాపిట్....సంగీతా ఆపిక....మెలిక వొద్దు సాఫీగా రా' అనే సాడు గట్టిగా.

'అయ్యో అదేమిటండీ నే నేమన్నానని మీ కంత కోపం వచ్చింది. ఎప్పుడో ప్రొద్దు ననగా ఆఫీసుకెళ్ళారు ఇంతవరకూ రాక పోతే ఒకవేళ ఊరికిగానీ వెళ్ళొచ్చారేమో ననీ. గడియారం తొమ్మిది గంటలు కొట్టింది. 'చూశారా నేనన్నది నిజం' అని ముగించింది సంగీత.

లలిత లలితంగా మురళి మీసకట్టు అతన్ని చిరాకు పెట్టసాగింది 'నువ్వు మగాడివోయ్. ఏమిటా అమ్మాయి ఆగడం. సంగతేమిటో కనుక్కో' అంటూ సన్నగా పొడవసాగాయ్ అతని మీసాలు.

'సంగీతా, నీ సంగీతమిక ఆపు. అసలు సంగతేమిటీ? నీ యీ నాటక ప్రదర్శన వెనుకగల కథాకమామీషూ ఎట్టిది.... త్వరగా చెప్పేయ్' అంటూ భయపడుతూనే కొంచెం గట్టిగా అన్నాడు.

''మహాశయా! ప్రశ్నలడగవలసిన నన్ను పట్టుకొని మీరే ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారే. ఇదేమిటీ కౌంటర్ అఫెన్సివ్ స్ట్రాటజీనా?''అంది సంగీత చలించకుండా.

మురళి మీసాలూరు కోవడం లేదు. ఊరికే ఎగిరెగిరి పడుతున్నాయ్. "అవురవురా! ఆడది నిన్ను నిలబెట్టి ప్రశ్నలు వేయడమా. తగదుగాక తగదు. నువ్వేదైనా చేస్తే చెయ్యి లేదా లేచి రేజరందుకొని మమ్మల్ని చంపేసెయ్" అంటూ గొడవపెట్టేసాయి.


చర్రున లేచాడు మురళి ''ఏమిటోయ్ నీ గొడవ. నీ ప్రశ్నలకు సమాధానం నేను చెప్పాలా? ఆఁ! ఆఁయ్! నీ ప్రశ్నలకు నేను సమాధానం చెప్పాలా? సమాధానం? నేను! ఆయ్! నేను నీకు సమాధానం....''

సాగిపోతున్న అతని వాక్ప్రవాహం వైవిధ్యం లేకుండా ఒకే రకంగా, సమాధానం, ప్రశ్న, నేను, నువ్వు, వీటినే తిరగేసి బోర్లేసి పక్కకేసి హైరానపడుతోంది

సంగీత దృఢంగా అంది "అవును మీరే....నా ప్రశ్నలకే....సమాధానమే... చెప్పాలి...." అంది వత్తిపలుకుతూ.

'ఏం వోయ్ మీసమూ ఏం చేద్దామంటావ్?' మురళి ఆలోచనా పూరితమై ప్రశ్నకు మీసాలోసారి పేలవంగా నవ్వి 'లాభం లేదు లాభం లేదు మూ!

నేరం నాది కాదు - ఆకలిది!




గొప్ప బాడ్‌గా వున్నట్లుంది 'మనావిడకి'. ఎలాగోలా కాంప్రమైజ్ ట్రైచెయ్యి. మరీ లొంగిపోకూ, మేము నిన్ను వదలాలంటే బాధగా వుంటుంది మరి ఆఁ" అని వూరుకొన్నాయి.)

"చెప్పాలి నేను కాదన్నానా! సంగీతం అబ్బ కోపంగా వున్నా నీ మాటలు "కోపసంగీతం"లా వున్నాయి తప్ప మరో వంక లేదు ఆఁ ఇంతకీ నీ ప్రశ్నలేమిటి బేబీ త్వరగా చెప్పమ్మా ఆకలేస్తోంది. అన్నం తినాలి. ఆ తరువాత కూడా 'ఆకలే'స్తోంది. చెప్పూ ఊఁ" అన్నాడు వీలైనంత లౌక్యమూ, ప్రేమ కలబోసి నటిస్తూ

" 'షార్ప్'అంటే అర్థంసెలవిస్తారా?"

"సిల్లీ కొశ్చన్ నీ డిగ్రీ చదువేమైనట్లు? ఇంత చిన్న పదానికి అర్థం తె యదా డిస్‌గ్రేస్ టూ ది మోడరన్ ఎడ్యు కేషన్—యూనివర్శిటీ స్టాండర్సు చెప్తా మంచినీళ్ళు" అన్నాడు మురళి.

"ప్రశ్నల అంకం ముగిసేకే మంచినీళ్ళు. మీరు నా ప్రశ్నలకు దయచేసి సమాధానం చెప్తేచాలు.ఉపన్యాసాలొద్దు."

"షార్ప్ అంటేపదునుగా అప్పుడప్పుడూ నేను షేవ్ చేసుకొనేటప్పుడు బ్లేడు తెగిందనుకో, అది చాలా షార్ప్‌గా ఉందన్నమాట. ఇప్పుడు నువ్వున్న మూడ్ ఉందిచూడు నీలో కోపం చూశావా? అది కూడా "షార్ప్" అని వర్ణించవచ్చు." 'డు ము వు లు ప్రథమా విభక్తి' చెప్పినంత బుద్ధిగాను చెప్పి సిగిరెట్ పెట్టె, అగ్గిపెట్టె బయటికి తీశాడు మురళి.

"నో స్మోకింగ్ తరువాత ప్రశ్న 'ఫైవ్‌థర్టీ షార్ప్' అంటే అర్థం?"

మురళికి షాక్ కొట్టినట్లయింది. ప్రశ్న విడిపోయింది. సమస్య తీరిపోయింది. సంగతి తెలిసిపోయింది. 'ఈ కోపానికి కారణం ఇదా! ఓహో ఇదా!'—అనుకొన్నాడు.

"అర్రెర్రెర్రె అదా విషయం. సంగీతా డియర్ ప్రియా "

"విశేషణాల సంబోధనలు వద్దు. సమాధానం కావాలి."

మీసం మళ్ళీ ఒక పోటు పొడిచింది మురళిని 'నువ్వారుకో మధ్య నేనెలాగో సర్దబోతుంటే పెద్ద మీసాల్తిప్పుతానంటావ్' అని మీసాల్ని కోప్పడి సంగీతకు సమాధానం చెప్పసాగాడు.

"చూడు సంగీతా 'ఫైవ్‌థర్టీ షార్ప్' అంటే ఖచ్చితంగా సెకండ్లు కూడా తేడా లేకుండా 'అయిదున్నర' అంటే అయిదు గంటల ముప్ఫై నిమిషాలన్న మాట "

"సరిగ్గా ముప్ఫై నిమిషాలయి వెతుకుతున్నాను బాబూ నీ కొంప ఏ అబిడ్స్ సెంటర్లోనే తీసుకొని ఏడ్వగూడదూ ఇల్లు.. ఆఁ" అంటూ లోపలికొస్తున్న ఓశాల్తీని నోరు తెరచుకొని చూస్తుండిపోయింది సంగీత.

మురళి తేరుకున్నాడు. "హాయ్ రమణా ఒరేయ్ నువ్వునా నువ్వే


## ఆంగ్లేయబోధిని

పిన్నలు, పెద్దలు ఆంగ్లము రానివారు మా ఆంగ్లేయబోధిని సహాయంతో 60 దినములలో ఆంగ్లము నేర్చుకొనవచ్చును వెల: రూ 10/-

## తమిళ్-తెలుగు స్వబోధిని

తమిళభాష రానివారు మా తమిళ-తెలుగు స్వబోధిని సహాయంతో 35 దినములలో తమిళం నేర్చుకొనవచ్చును. వెల: రూ. 3/-

## హిందీ-తెలుగు స్వబోధిని

హిందీ భాషను అతి సులభముగా అందరు 30 దినములలో హిందీ-తెలుగు స్వబోధినిద్వారా అతి త్వరలో నేర్చుకొనవచ్చును వెల: రూ. 4/-

పై వాటికి పోస్టేజి అదనము.

బాలసరస్వతీ బుక్ డిపో (ఫోన్: 29868) :. మద్రాసు 600 001



శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్ పతాకం క్రింద నిర్మాత ఎ. పూర్ణచంద్రరావు నిర్మించిన 'రాజు వెడలె'లో హీరో శోభన్ బాబు. ఈ చిత్రానికి దర్శకుడు తాతినేని రామారావు.

అవునూ రెండు సంవత్సరాలు దాటిపోలా నువ్వెళ్ళి....రా. రా. ఒక్కడివేనా.కూర్చో ముందు" అంటూ ఆ శాస్త్రీని కౌగలించు కొని ఓ కుర్చీలో కూలేశాడు మురళి. సంగీత అర్థంగాకుండా చూస్తుండి పోయింది అయోమయంగా.

"ఆగు నాయనా నా శ్రీమతీ, జూని యర్‌ను ఇంటిముందు టాక్సీలో "

"నేను తీసుకొస్తాను ఆ సంగీతా... నీకు తెలియదు కదూ....వీడు మనవాడే.... చాలా క్లోజ్....ఎంత క్లోజంటే చాలా క్లోజన్నమాట. రమణ పూర్తి పేరు నాకూ గుర్తులేనంత పొడుగనుకో. రేయ్ రమణా సంగీతరా ఆ నా జీవన సంగీతే వస్తా" అంటూ బయటకు దూసుకుపోయి మరో రెండు నిమిషాలకు పెద్ద సూట్ కేసూ, ఓ చిన్న బ్యాగూ, శ్రీమతి రమణ, జూనియర్ రమణ వీళ్ళతో తిరిగివచ్చాడు.

తరువాత ఓ అరగంటసేపు ఆ ఇంట సందడి నిండింది. సంగీతను కూడా తమలో చేర్చుకొని ఆ మిత్రులిద్దరూ ఎన్నో ముచ్చట్లాడారు. శ్రీమతి రమణ తలనొప్పిగా ఉందని పడుకొంది.

మాటల మధ్యలో అన్నాడు రమణ "చెల్లాయి (సంగీత) సెలక్షన్ బాగుందిరా' అని.

"అవును. సెలక్షన్ బాగుండకపోతే నన్ను ఎలా ఎన్నుకొంటుంది?" అన్నాడు కొంటెగా నవ్వుతూ మురళి.

"అది కాదోయ్ బడుద్ధాయ్. నా ఉద్దేశ్యం ఏమిటంటే నీ సెలక్షన్ బాగుందీ, ఇంత మంచి అమ్మాయిని కొట్టేశావూ అని" అన్నాడు రమణ.

"మరి నేనంటే ఏమిటనుకొన్నావురా! నా సెలక్షన్ బ్రహ్మాండం కాదూ సంగీతా?" అన్నాడు మళ్ళీ మురళి.

"అవును సార్ మీ కత్తికి రెండు వైపులా 'షార్ప్'నెస్ వుంది. ఎలా అయినా అది మీ గొప్పే. మేం వప్పేసుకొంటున్నాం. ఏం అన్నయ్యగారూ వప్పేసుకొందాం" అంటూ నవ్వింది సంగీత.

ఇంకా కొంచెంసేపు అలాగే మాట్లాడుకున్నారు. నవ్వుకున్నారు. రమణ మీదుగా మురళీ, సంగీతలు సరసాల యుద్ధం చేసుకున్నారు. అలా వాతావరణంలో మహత్తరమైన ఆనందం నిండివుండగా తేలు కుట్టినట్లరిచాడు రమణ 'పదిన్నరయి పోయిందిరోయ్' అని.

"ఏం కొంప మునిగిందీ సుబ్బరంగా భోంచేశావ్ నిద్ర వస్తే పడుకోవచ్చు. అంత ఖంగారు దేనికీ?" అన్నాడు మురళి.

"ఏడ్చావ్. టాక్సీ అర్జంట్ గా టాక్సీ కావాలి. 11 గంటల బస్సుకి వెళ్ళాలి. నువ్విక్కడ ఏడ్చావని చాలా కాలమయిందని పరుగెత్తుకొచ్చాను. మళ్ళీ వచ్చేటప్పుడు ఉంటా నాల్రోజులు టాక్సీ. టాక్సీ" అంటూ హడావిడిచేసి మరో పది నిమిషాల్లో టాక్సీ ఎక్కుతూ 'వస్తానమ్మా. మళ్ళీ వస్తాను. ఈ లోపు మా కోసం ఏదైనా స్పెషల్స్ చేసివుంచు. వస్తాన్రా—పోనీయ్ టాక్సీ' అన్నాడు రమణ. టాక్సీ బుర్రుమంది.

సంగీత వెనుకే లోపలికొచ్చిన మురళి జేమ్స్‌బాండ్ షార్ప్‌నెస్‌తో తలుపు గడియ పెట్టి "సంగీతా" అన్నాడు.

అతనివైపు ఏమిటన్నట్లుగా చూసింది సంగీత. ఆమె చూపుల్లో రమణ రాక ముందున్న కోపం కన్పడలేదు. నవ్వుతున్నాయి కళ్ళు. 'థాంక్స్‌రా రమణా' అనుకున్నాడు మురళి. 'బతికిపోయాం గురూ' అన్నాయతని మీసాలు. 'అయినా ఎందుకైనా మంచిది శత్రుశేషం ఉండకూడదు. ఈ లోపునే విషయం చెప్పెయ్. అంతా క్లియర్ అయిపోతుంది. మళ్ళీ ప్రశ్నల గురించి ప్రారంభమయితే అంతా కన్‌ఫ్యూజవుతుంది జాగ్రత్త' అని హెచ్చరించాయి కూడా!

తనవంకే చూస్తున్న సంగీతవంక తన్మయంగా చూస్తూ ఆమె దగ్గరగా జరిగి "మా ఆఫీస్ బోయ్‌ని టిక్కెట్లకు పంపితే ఇవ్వాళ్ళకు లేవని రేపు ఫస్ట్‌షోకి తెచ్చాడు. ఒట్టు, నీమీద ఒట్టు. ఇవిగో టిక్కెట్లు

చూడు. పోతే వస్తుంటే స్కూటర్ టైర్ పంచరయి  అది ఊడదీసి బాగుచేయించి ఆలస్యమై వచ్చేసరికి  ."

"ఇకనాపండి" అంది సంగీత కొంచెం గట్టిగా! మురళి అదిరి పడ్డాడు. మీసాలు ఖంగారుపడ్డాయి.

అనుమానంగా సంగీత ముఖంలోకి చూసిన మురళికి మతిపోయింది. ఆమెకళ్ళ నిండుకొన్న నీరు. మురళి దగ్గరగా జరుగుతోంది సంగీత "అయిదున్నరకు మీరు రాలేదూ, అన్న కోపంతో వివేకం మరిచి అసలు సంగతి పూర్తిగా అడిగి తెలుసుకోక ముందే మిమ్మల్ని  మిమ్మల్ని  " అంటూ ఆగిపోయింది.


"ఈజీ బేబీ నన్నేమన్లా నువ్వు. సరదాగా... నేనేం అనుకోలేదోయ్ ఏమిటిది అబ్బెబ్బె" అంటూ ఖంగారుగా ఓదార్చాడు మురళి.

"అప్పటికి అన్లేదేమో. కోపపుమైకంలో తర్వాత మీరేం చెప్పినా అదంతా నాటకం అనుకొనే దాన్నేమో! అపార్థం చేసుకొనే దాన్నేమో  ,!

"ఆగు" అన్నావా! చూడు నేనెన్నో సార్లు చెప్పానుగా. ఎప్పుడూ అపార్థం చేసుకోవద్దు, అపార్థం చేసుకొంటే అర్థం చేసుకొనే అవకాశం వుండదు గనుక అపార్థం చేసుకోవద్దు. అర్థం చేసుకొంటే అపార్థం చేసుకొనే అవసరమేలేదు. అపార్థంచేసుకొంటే అర్ధంచేసుకొనే. ."

"ఆపండి స్వామీ  ఇప్పుడు నిజంగా కోపమొస్తుంది, మీరాపకపోతే. చచ్చాను ఆ అర్థాలు అపార్థాలు లెక్కపెట్టలేక" అరిచింది సంగీత

"అలా అపార్థం చేసుకొనేట్లయితే నేను మాట్లాడను. నన్నర్థం చేసుకోవాలు"




అంటూ సంగీతను దగ్గరగా . . చాలా దగ్గరగా లాక్కున్నాడు మురళి. ఆ కౌగిలిలో నుండి అంది "ఏమైనా, రమణగారు దేవుడిలా వచ్చి అడ్డుపడ్డారు. లేకపోతే మిమ్మల్ని అపార్థం చేసుకొని ఎన్నెన్ని మాటలు అనేదాన్నో మిమ్మల్నర్థం చేసుకోక అపార్థం చేసుకొన్నందుకు నన్ను మన్నించరూ  "

నవ్వాడు మురళి, హాయిగా "చూడవోయ్. అందుకే మనం ఈ సినిమా చూడాలన్నాను. ఆ సినిమా వాళ్ళేం చెప్తున్నారో తెలుసా 'లవ్ మీన్స్ నాట్ ఎవర్ హావింగ్ టుసే యు ఆర్ సారీ' వాళ్ళింగ్లీషులో ఎలా అన్నా మన తెలుగులో ఏమనాలంటే" "ప్రేమికుల మధ్య క్షమించమనుకోవడాలు లేవు. ఏదైనా పొరపాటు జరిగితే క్షమించేసుకోవడాలే." మాట పూర్తికాకమునుపే బెడ్‌రూం చేర్చాడు సంగీతను లైటు తీసేసి వస్తూ పొరపాటున సంగీత కాలు తొక్కిన మురళి "సారీ" అన్నాడు.

"అదుగో సారీ చెబుతున్నారు లవ్ మీన్స్ నాట్ ఎవర్ హావింగ్ టు సే యు ఆర్ సారీ."

"అవును కదూ మర్చిపోయాను. సారీ చెప్పేశాను. సారీ ఇంకలా చెప్పను . . ఇప్పటికి సారీ  " ★